www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 22 మార్చి 2024
5
పశ్చిమ గోదావరి



రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం:ప్రసార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే, ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. దీనికోసం ప్రత్యేకంగా జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతోపాటు, చెల్లింపు వార్తలను (పెయిడ్ న్యూస్) పర్యవేక్షిస్తుందని, మీడియా ఉల్లంఘనలు కూడా గుర్తించి తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. అనుమతి పొందిన ఆర్డర్ నంబర్‌ను సంబంధిత ప్రకటనపై సూచించాల్సి ఉంటుందన్నారు.

ముందు నుయ్యి.. వెనుక గొయ్యి..!


వాలంటీర్ల ఆందోళన (ఫైల్‌ఫోటో)

గందరగోళంలో గ్రామ, వార్డు వాలంటీర్లు

ఎన్నికల విధులు, ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవని ఎన్నికల సంఘం హెచ్చరిక

మరోపక్క అధికార పార్టీ ఒత్తిళ్లతో సతమతం

ఉణుదుర్రులో 9 మంది వాలంటీర్ల తొలగింపుతో ఉలిక్కిపాటు

ప్రజాశక్తి - భీమవరం

ఒకపక్క వాలంటీర్లు ఎన్నికల విధులకు, ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం స్పష్టీకరణ.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారుల హెచ్చరికలు.. మరోపక్క ఎన్నికల ప్రచారానికి ఏదోక రూపంలో రావాలని అధికార పార్టీ నేతల ఒత్తిడి.. వెరసి గ్రామ, వార్డు వాలంటీర్లు లబోదిబోమంటున్నారు. దీంతో వాలంటీర్ల పరిస్థితి 'ముందు నుయ్యి.. వెనుక నుయ్యి' అనే చందంగా తయారైంది. ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని జిల్లాలో తొమ్మిది మంది వాలంటీర్లను ఇప్పటికే కలెక్టర్ విధుల నుంచి తొలగించారు. దీంతో వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు.

వైసిపి అధికారం చేపట్టిన తర్వాత సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థను నెలకొల్పింది. ఈ రెండు వ్యవస్థలను ముఖ్యమంత్రి జగన్ తన మానస పుత్రికలుగా పిలుస్తారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 15 వేల మంది గ్రామ, వార్డు వాలంటీర్లు పని చేస్తున్నారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్‌ను నియమించి ప్రతినెలా రూ.5 వేలు పారితోషికం చెల్లిస్తున్నారు. వైసిపి ప్రభుత్వం చేపట్టిన నవరత్నాల అమలులో వాలంటీర్ల వ్యవస్థ కీలకంగా వ్యవహరించింది. వివిధ సంక్షేమ పథకాలు అమలులో వీరు కీలకంగా వ్యవహరించారు. వైసిపి నేతలు, కార్యకర్తలకూ ఇవ్వని ప్రాధాన్యతను వాలంటీర్లకు ప్రభుత్వం కల్పించింది. అయితే మొదట్లో ఈ వాలంటీర్ల వ్యవస్థపై వైసిపి నేతల నుంచే వ్యతిరేకత వచ్చినప్పటికీ ప్రభుత్వం వెనక్కు తగ్గలేదు. వివిధ సందర్భాల్లో వాలంటీర్లకు ఉత్తమ సేవల పేరుతో అవార్డులు, నగదు బహుమతులను సైతం ప్రభుత్వం అందించింది. వాలంటీర్ వ్యవస్థపైనే వైసిపి ప్రభుత్వం ప్రధాన ఆధారంగా పరిపాలనను సాగించిందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఎన్నికల్లో సైతం వాలంటీర్లను ఉపయోగించుకునేందుకు సిద్ధమైంది. అయితే వాలంటీర్ల నియామకమే చట్ట వ్యతిరేకమని, వీరు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా ఉత్తర్వులు జారీ చేయాలంటూ కడప జిల్లాకు చెందిన ఒక వ్యక్తి కోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో వాలంటీర్ల వల్ల ప్రజలకు మేలు జరుగుతుందిగా అంటూనే ఎన్నికల విధుల్లో పాల్గొకూడదని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎన్నికలు రావడంతో వాలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అయితే వాలంటీర్లు స్వచ్ఛంద సేవకులు అని, పూర్తికాల ప్రభుత్వ ఉద్యోగులు కాదు కాబట్టి వారికి ఎన్నికల కోడ్ వర్తించదని వైసిపి వాదిస్తోంది. వాలంటీర్లు పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులు కాకపోయినప్పటికీ, ప్రభుత్వ సంఘటిత నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్) నుంచే గౌరవ వేతనం అందుకుంటున్నారు. కాంట్రాక్టు, పర్మినెంట్ ఇలా పేరు ఏదైనప్పటికీ గౌరవ వేతనం, జీతం, రెమ్యునరేషన్ ఇలా తీరు ఏమైనప్పటికీ ప్రభుత్వ సంఘటిత నిధి నుంచి డబ్బులు తీసుకుని పని చేసే వారంతా పబ్లిక్ సర్వెంట్ కిందకే వస్తారని న్యాయ నిపుణులు చెబుతున్నారు. వీరందరికీ 'కోడ్ ఆఫ్ కాండక్ట్' వర్తిస్తుందని, వాలంటీర్లకు దీనిలో మినహాయింపేమీ ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వాలంటీర్లను వెంటాడుతున్న కేసుల భయం

కోర్టు ఆదేశాలు.. ఎన్నికల సంఘం హెచ్చరికలతో వాలంటీర్లను కేసుల భయం వెంటాడుతుంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 123, 129, 134ఎ సెక్షన్లతోపాటు ఐపిసి 171(ఎఫ్) ప్రయోగించే అవకాశం ఉందని న్యాయనిపుణులు చెబుతున్నారు. నియమావళిని ఉల్లంఘించే వాలంటీర్లపై ఆ సెక్షన్ల కింద కేసులు పెట్టాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. సెక్షన్ 123 ప్రకారం ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటం నేరం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించినా, వారికి ఓటేయాలంటూ ప్రభావితం చేసినా సెక్షన్ 129 ప్రకారం కేసు నమోదు చేయవచ్చు. సెక్షన్ 134ఎ ప్రకారం పబ్లిక్ సర్వెంట్లు ఎవ్వరూ పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లుగా వ్యవహరించకూడదని చట్టం స్పష్టం చేస్తోంది. ప్రభుత్వ సంఘటిత నిధి నుంచి గౌరవ వేతనం పొందుతున్న వాలంటీర్లందరికీ ఈ సెక్షన్లు వర్తిస్తాయని, వీటిని ఉల్లంఘిస్తే కేసు నమోదు చేసి శిక్షించవచ్చునని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

తొమ్మిది మంది వాలంటీర్లపై వేటు

ఉండి మండలం ఉణుదుర్రు గ్రామ సచివాలయంలో పని చేస్తున్న తొమ్మిది మంది వాలంటీర్లపై వేటు వేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు అభియోగాలు రుజువు కావడంతో సార్వత్రిక ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద తొమ్మిది మంది వాలంటీర్లను విధుల నుంచి తొలగించారు. ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఫొటోలతో సహా రుజువు కావడంతో విచారణ అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో వాలంటీర్లలో గుబులు నెలకొంది. కొంతమంది వాలంటీర్లు సొంతంగానే ప్రచారంలో బహిరంగంగా పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. రాని వాలంటీర్లపై అధికార పార్టీ నేతలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది.

విధి, విధానాలపై స్పష్టత కరువు

ప్రస్తుతం ఎన్నికల షెడ్యూలు విడుదలైనప్పటికీ వాలంటీర్ల విధివిధానాలపై ఇప్పటివరకు కనీస స్పష్టత రాలేదు. వాలంటీర్లు నిర్వర్తించాల్సిన విధులేమిటీ, ఏ పని చేయాలి, ఏమి చేయకూడదు తదితర అంశాలపై ఇప్పటికీ అయోమయం కొనసాగుతోంది. దీనిపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. వాలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదని, పార్టీలకు ఏజెంట్లుగా ఉండకూడదని మాత్రమే ఎన్నికల సంఘం తెలిపింది. మిగిలిన అంశాలపై ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు. ఉన్నతాధికారుల నుంచి సచివాలయ అధికారుల వరకూ వాలంటీర్ల విధులపై నిర్ధారణకు రాలేకపోతున్నారు. కేసులు భయం వెంటాడుతుండడంతో రాబోయే రోజుల్లో తమకు ఉద్యోగ అవకాశాలు దక్కే అవకాశం ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 324 ధాన్యం కొనుగోలు కేంద్రాలు


7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

211 రైస్‌మిల్లులకు ధాన్యం తరలింపునకు 2,600 వాహనాలు

వచ్చే నెల మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలుకు చర్యలు

కలెక్టర్ సుమిత్ కుమార్


ప్రజాశక్తి - భీమవరం


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

జిల్లాలో రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేసేలా కార్యచరణ రూపొందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 324 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా తీసుకున్నామన్నారు. వచ్చే నెల మొదటి వారంలో ధాన్యం కొనుగోలుకు అన్ని విధాలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. స్థానిక కలెక్టరేట్లో రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుపై ఆయన జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్యతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీలో దిగుబడి అంచనా 9.45 లక్షల మెట్రిక్ టన్నులని, 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా తీసుకున్నామని వివరించారు. మిల్లర్లు, అధికారుల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమన్నారు. 324 రైతుభరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా కోటీ 80 లక్షల గోనెసంచులు సిద్ధం చేసి అన్ని రైతుభరోసా కేంద్రాలకు తరలించి నిల్వ ఉంచాలన్నారు. జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం మండలస్థాయి సేకరణ కమిటీలను నియమించామన్నారు. 211 రైసుమిల్లులను గుర్తించి, వాటికి కస్టోడియన్ అధికారుల నియామకం జరిగినట్లు తెలిపారు. సేకరణ లక్ష్యాలను సాధించడం కోసం హమాలీలతోపాటు 2,600 వాహనాలను సిద్ధం చేసుకోవాలన్నారు. మిల్లర్లు ద్వారా బ్యాంకు గ్యారంటీకి సంబంధించిన పనులన్నీ సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు నియామకం చేసుకుని ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి శిక్షణ పూర్తి చేసి, ధాన్యం కొనుగోలుకు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఎఫ్‌సిఐ మేనేజర్ రంజిత్‌కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు, జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి వివి.నాగరాజు, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, సివిల్ సప్లయిస్ సహాయ మేనేజర్ పిడిఎన్.సత్యనారాయణ, జిల్లా రైసుమిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సిహెచ్.నరసింహారావు, సంయుక్త కార్యదర్శులు పి.రాధాకృష్ణ, ఎ.ఫణికుమార్ పాల్గొన్నారు.

వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా..?

ప్రజాశక్తి - వీరవాసరం


మండలంలో ప్రతి ఇంటి గోడపైనా ఉన్న స్వచ్ఛ భారత్ స్టిక్కర్

గతం కంటే ఈసారి ఎన్నికల నిబంధనలు కఠినతరంగా అమలు చేస్తున్నారు. అయితే ఐదు సంవత్సరాల క్రితం టిడిపి ప్రభుత్వ హయాంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రతి ఇంటికీ స్వచ్ఛ భారత్ పేరుతో ప్లాస్టిక్ స్టిక్కర్లు అతికించారు. వీటిపై మహాత్మాగాంధీ పెట్టుకున్న కళ్లజోడు పోలిన బొమ్మతో పాటు చంద్రబాబు, నారా లోకేష్ ఫొటోలు ముద్రించి ఉన్నాయి. ప్రతి ఇంటి గోడపైనా ఎటువంటి పరిస్థితుల్లోనైనా చెక్కుచెదరకుండా మేకులు కొట్టి వీటిని ఏర్పాటు చేశారు. నాటి నుండి నేటి వరకు అవి అలానే ఉన్నాయి. ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో వాటివైపు ఎవరూ కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. సిపిఎం స్మారక స్థూపాలు సైతం ఓటర్లను ప్రభావితం చేస్తాయంటూ వాటిపైనా ముసుగులు వేస్తున్నారు. అయితే ప్రతి ఇంటి ముందున్న ఈ స్టిక్కర్లు అధికారులకు కన్పించడం లేదా, లేక ఇవి ఓటర్లను ప్రభావితం చేయవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

సిఎఎను ఉపసంహరించుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం రూరల్


ప్రచారం చేస్తున్న సిపిఎం మండల కన్వీనర్ శ్రీనివాస్

రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం వెంపలోని పెదపేటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా మత ఆధారంగా తీసుకొస్తున్న పౌరసత్వ సవరణ చట్టం సిఎఎను ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో బుంగా దావీదు, ఇంజేటి రమేష్, పోలుకొండ కుటుంబరావు, మంద రంగారావు, వర్ధనపు నర్సింహ, నతానీయులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ రూటే వేరు..!



- వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా డిఎంహెచ్‌ఒ కార్యాలయం
- హాట్‌టాపిక్‌గా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల బదిలీల వ్యవహారం
- కాంట్రాక్ట్ ఉద్యోగులను బదిలీ చేసేందుకు నిబంధనలు వర్తిస్తాయా
- ఉద్యోగులపై కక్షపూరితంగా వ్యవహరించినట్లు ఆరోపణలు
- ఎన్నికల కోడ్‌లో ఉద్యోగుల చేతికి బదిలీ ఉత్తర్వులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు తమరూటే వేరన్నట్లు వ్యవహరిస్తున్నరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి ఇష్టం లేని వారిని బదిలీలు చేయడం, ఇష్టం ఉన్నవారిని డిప్యూటేషన్ల పేరుతో నియమించడంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేసే అర్బన్ ప్రయిమరీ హెల్త్ సెంటర్లలోని 16 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను ఆకస్మాత్తుగా బదిలీ చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కాంట్రాక్ట్ ఉద్యోగులను బదిలీ చేసేందుకు నిబంధనలు వర్తించవని తెలిసినా కక్షపూరితంగా కావాలనే ఎన్‌యుఎంలోని ఉద్యోగులను బదిలీ చేసినట్లు తెలుస్తోంది. బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను పరిశీలిస్తే అనేక విషయాలు పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఏలూరు పట్టణంలోని గజ్జలవారిచెరువు, కొత్తపేట, జెపికాలనీ, లంబాడీపేట, పవర్‌పేట, వెంకటాపురం, మోతేవారితోట వంటి అర్బన్ ప్రయిమరీ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న 16 మంది ఉద్యోగులను ఉన్నట్టుండి చింతలపూడి, ఏలూరులోని పలు సెంటర్లకు బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వుల్లో అధికారులు చెప్పిన కారణాలు ఏమిటంటే 2024 ఫిబ్రవరి 19న ఎన్‌హెచ్‌ఎంలోని అధికారైన జిల్లా ప్రోగ్రామింగ్ కోఆర్డినేటర్ అర్బన్ ప్రయిమరీ హెల్త్ సెంటర్లకు తనిఖీలకు వెళ్లగా అక్కడ కొన్ని సమస్యలు గుర్తించారని, ఆ కారణంగా అందుకు కారణమైన ఉద్యోగులను బదిలీ చేసినట్లు తెలిపారు. ఒకవేళ ఉద్యోగులు తప్పు చేసినట్లు గుర్తిస్తే ముందుగా మెమో లేక నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. అటువంటిదేమీ ఇక్కడ జరగలేదు. ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తనిఖీ చేసిన తేదీన ప్రోగ్రాం కోఆర్డినేటర్ తనిఖీలకే వెళ్లలేదని తెలుస్తోంది. వెళ్లినట్లు రిజిస్టర్‌లో సంతకాలు ఎక్కడా లేవని సమాచారం. ఒకవేళ వెళ్లినా మెమో, నోటీసు వంటివి ఇచ్చి ఉద్యోగుల నుంచి సంజాయిషీ కోరడం వంటి ఏఒక్క ప్రక్రియ చేపట్టలేదు. ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని తెలిసి కోడ్‌కు ఒక్కరోజు ముందు 15న ఉద్యోగులను బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 16వ తేదీ సాయంత్రం ఎన్నికల కోడ్ వచ్చాక ఉద్యోగులకు బదిలీల ఆర్డర్ ఇవ్వడం గమనార్హం. ఈ వ్యవహారం చూస్తే ఇదంతా ఒక గూడుపుఠాణిలో భాగంగా జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బదిలీలకు సంబంధించిన ఉత్తర్వుల్లో వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అధికారులకు తెలియజేసినట్లు ఎక్కడా పేర్కొనలేదు. కాంట్రాక్ట్ ఉద్యోగులను బదిలీ చేసేందుకు నిబంధనలు వర్తించవని తెలిసినప్పటికీ ఉద్దేశపూర్వకంగానే బదిలీలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీలకు ముందు జరిగిన వ్యవహారం ఏమిటో బయటికి వస్తే అసలు నిజాలు జనాలకు తెలిసే అవకాశం ఉంటుంది. దీనిపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఏం సమాధానం చెబుతారో వేచిచూడాలి.

అడ్డగోలుగా డిప్యూటేషన్లు..?

వైద్యఆరోగ్యశాఖలో డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. అయితే జిల్లా వైద్యఆరోగ్యశాఖలో అడ్డగోలుగా డిప్యూటేషన్ల వ్యవహారం సాగుతున్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఏలూరు డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో దాదాపు 25 మంది వరకూ డిప్యూటేషన్‌పై పని చేస్తున్నట్లు సమాచారం. దీనిలో సీనియర్ అసిస్టెంట్లు, ఎంపిహెచ్‌ఒలు, ఎఫ్ఎన్ఒలు, ఎంఎన్ఒలు, ఫార్మాసిస్టులు సైతం ఉన్నట్లు తెలిసింది. పిహెచ్‌సిల్లో ఉద్యోగులను ఇష్టానుసారంగా డిప్యూటేషన్లపై మార్చడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు కుంటుపడుతున్న పరిస్థితి నెలకొందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో ఫార్మాసిస్టు అవసరం లేకపోయినా ఇక్కడికి తెచ్చినట్లు తెలుస్తోంది. అలాగే ఎంపిహెచ్‌ఒ పోస్టు లేకపోయినా తెచ్చారని, సర్వీస్ ఇంజినీర్‌కు నిబంధనలకు విరుద్ధంగా ఎఒ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్వీస్ ఇంజినీర్‌కు ఎఒ బాధ్యతలు అప్పగించకూడదని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ నియమించినట్లు తెలుస్తోంది. ఉద్యోగుల నియామకాల్లోనూ, బదిలీల్లోనూ, డిప్యూటేషన్లపై ఇలా అనేక విషయాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై కొంతకాలంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారులు దృష్టి సారిస్తే తప్ప ఇక్కడ సమస్యలు పరిష్కారమయ్యే పరిస్థితి కన్పించడం లేదనే చర్చ సర్వత్రా సాగుతోంది.

ధాన్యం బకాయిలు చెల్లించాలి

భీమవరం :జిల్లాలో రైతులకు రావాల్సిన రూ.16 కోట్ల బకాయిలను వెంటనే ఇవ్వాలని కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది ఈ మేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాళ్వా పంట చేతికొస్తున్నా గత సార్వా పంట సొమ్ము కౌలు రైతులకు చెల్లించకపోవడం దారుణమని పేర్కొన్నారు. జిల్లాలో 1300 మంది రైతులకు రూ.16 కోట్ల 40 లక్షల వరకూ చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఈ చెల్లింపుల్లో ఎక్కువ శాతం కౌలురైతులు, పేదరైతులు ఉన్నారన్నారు. ప్రభుత్వం నెలల తరబడి ధాన్యం డబ్బులు ఇవ్వకపోవడంతో అటు తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరగడంతోపాటు దాళ్వా పంటలకు పెట్టుబడికి డబ్బుల్లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ధాన్యం డబ్బులు, పంట నష్టం కౌలు రైతులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే గుణపాఠం తప్పదు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయ్య

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 38వ వార్షికోత్సవం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ నేపథ్యంలో 2023 కార్యకలాపాల రిపోర్టును యూనియన్ కార్యదర్శి ధనాల దానయ్య ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు రిపోర్టును ఆమోదించారు. ఈ వార్షికోత్సవాన్ని ఉద్దేశించి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కోసం సిఐటియు నిరంతరం పోరాటాలు చేసి విజయం సాధించిందన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి కనీస వేతనాలు అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యూటీ, ఇన్సూరెన్స్ అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని, శానిటేర్ వర్కర్స్‌కు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించడం దుర్మార్గమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అదానీ, అంబానీలకు కట్టబెట్టడం దారణమని అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కొడమంచిలి బాబు, ప్రధాన కార్యదర్శిగా జగ్గు రాము, జాయింట్ సెక్రటరీగా ఆర్‌పి.సింగ్, కోశాధికారిగా కోరశిఖ సుబ్బారావు, మరో ఆరుగురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఆర్, కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, ఎబి.శ్రీనివాస్, ధనాల దానయ్య, ధనాల వెంకట్రావు, సిర్రా శ్రీనివాస్, అల్లం పూర్ణిమ, కె.దయామణి పాల్గొన్నారు.

రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే చర్యలు

కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని అనుసరించి రూ.50 వేలకు మించి నగదును ప్రయాణ సమయంలో తీసుకెళ్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ప్రయాణ సమయంలో రూ.50 వేలకు మించి నగదును తమ వద్ద ఉంచుకోకూడదని పేర్కొన్నారు. రూ.పది వేలకు మించి విలువైన వస్తువులను కూడా ప్రయాణ సమయంలో తమతోపాటు తీసుకెళ్లకూడదని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పై సూచించిన మొత్తం కంటే ఎక్కువగా తీసుకెళ్లాల్సిన అవసరం వచ్చినప్పుడు కచ్చితంగా ఆ డబ్బుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆధారాలతో సహా తమవద్ద ఉంచుకోవాలని, తనిఖీ అధికారులకు వాటిని చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మతోన్మాదం, రైతు వ్యతిరేక విధానాలపై పోరు

సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ హరేరాం

ప్రజాశక్తి - భీమవరం


మాట్లాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ హరే రామ్

ఈ నెల 23న భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సామ్రాజ్యవాద వ్యతిరేక దినంతోపాటు దేశంలో మతోన్మాదం, రైతు వ్యతిరేక విధానాలపై పోరు చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల హరేరాం పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం ఎం.రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హరేరాం మాట్లాడుతూ ప్రతియేటా విప్లవ యోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ ఏడాది దేశ ప్రజలను రైతులని ఇబ్బంది పెడుతున్న మతోన్మాదం, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భగత్‌సింగ్ వర్ధంతి సభలు జరపాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు నిర్ణయించాయన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాల్లోనూ రైతు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, విద్యార్థులు మహిళలు అంతా కాగడాలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు, సభల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, రైతుసంఘం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు పాల్గొన్నారు.

'బొలిశెట్టి గెలుపునకు కృషి చేయాలి'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కడియద్ద గ్రామంలో గురువారం టిడిపి మండల అధ్యక్షులు పరిమి రవికుమార్ అధ్యక్షతన క్లస్టర్-1 ఇన్‌ఛార్జి మద్దిపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో క్లస్టర్ - 1 నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు క్లస్టర్ నాయకులు, కార్యకర్తలు మండలంలోని అన్నీ గ్రామాల్లో, పట్టణంలోని అన్ని వార్డుల్లో తిరిగి టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎంఎల్‌ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల సత్యనారాయణ, మండల అధ్యక్షులు పరిమి సత్యనారాయణ, సూర్పన వెంకట్రావు, బుర్ల రాము, మందాలపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అలుగులమ్మ జాతరలో ఎంఎల్‌ఎ రామరాజు

ప్రజాశక్తి - ఉండి

చెరుకువాడలో అలుగులమ్మవారి ఆలయ 105వ వార్షిక మహోత్సవం సందర్భంగా గురువారం ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు ఇర్రింకి సత్యనారాయణ (బుజ్జి), నాయకులు మంతెన నరసింహరాజు, మంతెన సాయలచ్చిరాజు పాల్గొన్నారు.

'రాబోయే ఎన్నికల్లో వైసిపిని సాగనంపాలి'

ప్రజాశక్తి - పాలకోడేరు

రాబోయే ఎన్నికల్లో వైసిపిని ఇంటికి సాగనంపాలని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు కోరారు. ఇంటింటికి రాంబాబు కార్యక్రమాన్ని మోగల్లులో గురువారం నిర్వహించారు. తనకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, కామన రాంబాబు, నాయకులు కొత్తపల్లి నాగరాజు, గాదిరాజు శ్రీనివాసరాజు, సంకరుడు, సత్యనారాయణరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోడ్ పట్టదా..!

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులను కొన్ని చోట్ల మాత్రమే తొలగిస్తున్నారు. ప్రచార బోర్డుల్లో రాజకీయ నాయకుల ఫొటోలు కనిపించకుండా ముసుగు వేయాలి. అయితే కొన్ని ప్రాంతాల్లో తెరపడగా కొన్ని చోట్ల వాటిని అలాగే ఉంచేశారు. మండలంలోని కాళ్లకూరు, పల్లెపాలెం గ్రామాల్లో సిఎం జగన్ మోహన్‌రెడ్డి, సర్పంచులతో ఉన్న సుస్వాగతం బోర్డులు అధికారులు అలాగే ఉంచేశారు. ఇలా బోర్డులు కనిపిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఆచంట

ఓటర్లందరూ ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకోవడం దేశ అభివృద్ధిలో ఓ కీలక అంశమని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు అన్నారు. గురువారం నియోజకవర్గంలో ఓటు హక్కు నమోదుపై ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు నమోదు చేసుకునే దరఖాస్తులను పర్యవేక్షించేందుకు పెనుగొండ చిన్నమల్లం గ్రామ పంచాయతీలో ఫారం-6 క్లెయిములను పరిశీలించగా బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారిని తిరస్కరించినట్లు ఆయన తెలిపారు. ఇటువంటి క్లైములను సిఫార్సు చేయొద్దని బిఎల్‌ఒలకు ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 15వ తేదీ వరకూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తమ ఓటు హక్కును నమోదు చేసుకునేందుకు అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు. అర్హులు కాని వారు ఓటు నమోదు చేసుకుని ఉంటే వారికి నోటీసులు జారీ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇటువంటి వారిని ప్రోత్సహిస్తే సంబంధిత బిఎల్‌ఒలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నరసాపురం: మై ఫస్ట్ ఓట్ ఫర్ సిటిజన్ కార్యక్రమంలో భాగంగా నరసాపురంలో కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతకు ఓటు ప్రాముఖ్యతను రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి వివరించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను సర్వాంధ్రప్రదేశ్ మార్గంలోకి తీసుకెళ్లే సత్తా ఉన్న వ్యక్తి చంద్రబాబు అన్నారు. యువత మొదటి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బండి స్వర్ణలత, తోట భారతి, సుందర రాజకుమార్, జాన్సీ పాల్గొన్నారు.

భీమవరం : ఓటు వేయడం దేశభక్తిలో ఒక భాగమని జిల్లా స్వీప్ నోడల్ అధికారి జిసిహెచ్.ప్రభాకర్ అన్నారు. గురువారం భీమవరం ఏరియా ప్రభుత్వాసుపత్రిలో ఓటర్ల అవగాహనా కార్యక్రమం జిల్లా స్వీప్ నోడల్ అధికారి జిసిహెచ్.ప్రభాకర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు విలువ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎలా ఓటు వేయాలని వివరించారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వేయడమనేది మన కనీస బాధ్యత అన్నారు. కార్యక్రమములో హాస్పిటల్ సూపరింటెండెంట్ మాధవి కళ్యాణి, నెహ్రూ యువజన కేంద్ర కన్వీనర్ కుసుమ పాల్గొన్నారు.

అభ్యర్థిని గెలిపిస్తాం : రామరాజు

ప్రజాశక్తి - నరసాపురం

ఉమ్మడి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని బిజెపి, టిడిపి ఇన్‌ఛార్జిలు పివిఆర్, పొత్తూరి రామరాజు అన్నారు. గురువారం జనసేన కార్యాలయంలో బిజెపి, టిడిపి, జనసేన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా కూటమి ఇన్‌ఛార్జులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, గంటా కృష్ణ, మేకల సతీష్, శిరిగినీడి రాజ్యలక్ష్మి, గుబ్బల నాగరాజు పాల్గొన్నారు.

సమన్వయ కమిటీ సమావేశానికి కాపు ముఖ్య నాయకులు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి రామ్మోహన్ నాయుడు దూరంగా ఉన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నాయకులందరూ పనిచేస్తారు లేదో తెలియాల్సింది.

చోరీ కేసుల్లో ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - తణుకురూరల్

తాడేపల్లిగూడెంటౌన్, రూరల్, తణుకు టౌన్, రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడిన నలుగురు ముద్దాయిలను, లిఫ్ట్ ఇస్తానంటూ మోటారు సైకిల్‌పై తీసుకెళ్లి దోపిడీకి పాల్పడుతున్న ముద్దాయిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుండి సుమారు రూ.10 లక్షలు విలువైన 175 గ్రాముల బంగారు వస్తువులు, రూ.రెండు లక్షల విలువ చేసే రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తణుకు పట్టణ పాత పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను డిఎస్‌పి డిఎస్‌ఆర్‌విఎస్‌ఎన్.మూర్తి వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెంది ప్రస్తుతం తాడేపల్లిగూడెం మిలటరీ కాలనీలో ఉంటున్న గనసాల దుర్గాప్రసాద్, తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీకి చెందిన లకనవరపు వెంకటాచారి చెడు వ్యసనాలకు బానిసలై తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.6.24 లక్షల విలువైన బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గణపవరం మండలం పిప్పరకు చెందిన గరగ శివకృష్ణ, వీరవాసరం మండలం పంజావేమవరం గ్రామంకి చెందిన పంజా శ్రీనివాసరావు తణుకు పట్టణంలో ఉమెన్స్ కాలేజీ దగ్గరలో వృద్ధుడిని మోటార్ సైకిల్ ఎక్కించుకుని తనకు తెలిసిన వాడిలా మాట్లాడి తాను ఒక స్థలం కొన్నాను దానిని చూసి బాగుందా లేదా చెప్పాలని ఇద్దరు కలిసి కావలిపురం లాకుల వద్దకు తీసుకెళ్లి దాడి చేశారని, అతని చేతికి ఉన్న 4 గ్రాముల బంగారు ఉంగరం దొంగిలించారని తెలిపారు. నేరానికి ఉపయోగించిన మోటారు సైకిలు, తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్‌స్టేషన్ కేసులో 20.9 గ్రాముల మూడు ఉంగరాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోపవరం గ్రామానికి చెందిన ఆకుల రమేష్, జీవనోపాధి నిమిత్తం పెళ్లి సంబంధాలు చూస్తున్న ఏలూరులోని శ్రీరాంనగర్ లో నివాసం ఉంటున్న పల్లిపోతుల హరిమోహన్‌రావుకు మాయ మాటలు చెప్పి మోటారు సైకిల్ పై లిఫ్ట్ ఇస్తానని చెప్పి తణుకు తేతలి జాతీయ రహదారిలోని కొండాయపాలెం వెళ్లే రోడ్డులో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి మెడలో ఉన్న గొలుసు, చేతికి ఉన్న ఉంగరం ఇమ్మని చాకుతో బెదిరించాడని, హరిమోహన్‌రావు ముద్దాయిని ప్రతిఘటించి ఎదుర్కొన్నాడని తెలిపారు. దోపిడీకి యత్నించిన కేసులో ఉపయోగించిన చాకు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని, తణుకులో రెండుచోట్ల, పెరవలిలో ఒకచోట నేరాలు చేశాడని, రూ.2.40 లక్షల విలువైన 40 కాసుల బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు చేసిన ముద్దాయిలను కోర్టులో హాజరు పరుస్తామన్నారు. సమావేశంలో తణుకు టౌన్ సిఐ నాగరాజు, తణుకు రూరల్ సిఐ జివివి.నాగేశ్వరరావు, ఎస్ఐ కె.చంద్రశేఖర్, తాడేపల్లిగూడెం సిఐ ఎ.సుబ్రహ్మణ్యం, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విచక్షణా రహితంగా చెట్ల నరికివేత!

ప్రజాశక్తి - కాళ్ల

మరమ్మతులు, నిర్వహణ పనుల్లో భాగంగా విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను మండలంలోని పలు గ్రామాల్లో ఇష్టానుసారంగా నరికేశారు. విద్యుత్‌వైర్లకు తగిలిన కొమ్మలను, దగ్గరగా ఉన్న కొమ్మలను నరకడం పరిపాటే అయితే అవసరం లేకున్నా చెట్టు మొదలు వరకూ నరికేయడంపై పలువురు విమర్శిస్తున్నారు. సీసలి, కాళ్ల గ్రామాల్లో జువ్వలపాలెం రహదారికి ఇరువైపులా చెట్లను నరికేశారు. కొన్ని చెట్ల కొమ్మలు మాత్రమే నరగ్గా, ఎక్కువగా చెట్టు సగభాగాన్నీ, మొదలు వరకూ మిషనుతో కోసివేశారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసే క్రమంలో ఈ తరహా చర్యలు తప్పనిసరి అయినప్పటికీ అవసరం లేకుండా, మళ్లీ ట్రిమ్మింగ్ చేసే పనిలేకుండా ఒకేసారి చెట్లను నరికివేయడాన్ని తప్పుపడుతున్నారు. ఎంతో కష్టపడి మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ పెంచి పెద్దవి చేస్తే బాధ్యతా రాహిత్యంగా ఇలా నరికేడం ఆవేదన కలిగించిందని పర్యావరణ హితులు, సీసలి, కాళ్ల గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.



కాళ్లలో నరికేసిన చెట్ల కొమ్మలు, చెట్లు

మూడోసారి ఎంఎల్‌ఎగా గెలిపించాలి

స్వతంత్ర అభ్యర్థి, ఉండి మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గం నుంచి మూడోసారి ఎంఎల్‌ఎగా గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి, ఉండి మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) ప్రజలను కోరారు. మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు స్వగ్రామమైన కలవపూడిలో భీమేశ్వరస్వామి వారిని గురువారం దర్శించుకున్నారు. సొంత గ్రామంలో కలవపూడి శివకు గ్రామస్తులు హారతులతో స్వాగతం పలికారు. టిడిపి కంచుకోటగా చెప్పుకునే ఉండి నియోజకవర్గంలో కలవపూడి శివకు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో శివ రామరాజు మాట్లాడుతూ కలవపూడి గ్రామస్తుల నుంచి తనకు అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని, మా తండ్రి సుబ్బరాజు కలవపూడి గ్రామం అభివృద్ధి చెందాలని, పంట, మురుగుకాలువల తవ్వకం పనులు చేపట్టాలని తపన పడేవారన్నారు. హైస్కూల్ అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోనే ఉంటూ ఉండి అభివద్ధి కోసం పాటుపడతానన్నారు. రైతులకు బిడ్డగా, మహిళలకు అన్నగా ఉంటానని తెలిపారు. మరొకసారి తనను ఉండి నియోజకవర్గం నుంచి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలవపూడి గ్రామ సర్పంచి గేదెల జాన్, మాజీ సర్పంచి ముదుండి సూర్యకాంతం మణిబాబు, వేగేశ్న బాలగణపతి వర్మ, నంబూరి త్రినాథమూర్తిరాజు, ముదుండి వెంకట్రామరాజు, ఎం.శ్రీవెంకట్రాజు, మంతెన రామరాజు, మానుగుండు సుబ్బారావు పాల్గొన్నారు.



కలవపూడిలో ప్రచారం చేస్తున్న మాజీ ఎంఎల్‌ఎ శివ

జెవిఆర్ మృతి పార్టీకి తీరని లోటు

మాజీ ఎంఎల్‌ఎ మాధవ నాయుడు

ప్రజాశక్తి - మొగల్తూరు

మాజీ జెడ్‌పిటిసి సభ్యులు, టిడిపి సీనియర్ నాయకులు జక్కంశెట్టి వెంకటేశ్వరరావు మతి పార్టీకి తీరనిలోటని మాజీ శాసనసభ్యులు బండారు మాధవ నాయుడు అన్నారు. కాళీపట్నం పడమర గ్రామానికి చెందిన జక్కంశెట్టి వెంకటేశ్వరరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. గురువారం కాళీపట్నంలో వెంకటేశ్వరరావు నివాసంలో ఆయన భౌతికకాయాన్ని మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. జెవిఆర్ పార్టీకి పెద్ద దిక్కుగా ఉండేవారని, ఆయన సలహాలు సూచనలు పార్టీ అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడేవని తెలిపారు. వద్దే నా రాజకీయ ప్రయాణంలో వారి సూచనలతో ఎంతో నేర్చుకున్నానని తెలిపారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపిపి అంద్రాజు రామన్న, కవురు ఆదినారాయణ, రంగా, కొట్టు పండు, చాగంటి ఆనంద్, కొల్లటి హరికృష్ణ, గుబ్బల మహేష్, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ఉన్నారు.



వెంకటేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాధవనాయుడు

ఉమాబాలను కలిసిన బాలకృష్ణ

ప్రజాశక్తి - పాలకోడేరు

నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాలను ఆమె కార్యాలయంలో గురువారం వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ నరసాపురం పార్లమెంటు స్థానంలో ఇప్పటివరకూ అగ్రవర్ణాలే ఎన్నికల్లో పోటీచేసినట్లు తెలిపారు. జిల్లాలో మొట్ట మొదటిసారిగా నరసాపురం ఎంపీ స్థానాన్ని ఒక బిసి మహిళకు కేటాయించడం అభినందనీయమన్నారు. అలాగే ఏలూరు ఎంపీ స్థానాన్ని సునీల్‌కుమార్‌కు కేటాయించడం ముఖ్యమంత్రి జగన్ బిసిల పక్షపాతి అనటానికి నిదర్శనం అన్నారు. బిసిలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన వైసిపి ప్రభుత్వాన్ని బిసి సోదరులందరూ గెలిపించుకోవాలని కోరారు. ఆయన వెంట వైసిపి సీనియర్ నేత పాల రాధాకృష్ణ ఉన్నారు.

జనసేనలో చేరికలు

నరసాపురం: జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులై మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన 50 మంది జనసేనలో చేరారు. కలవకొలను తాతాజీ ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జనసైనికులు అభిమానిస్తారు : గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తర్వాత జన సైనికులు తననే అభిమానిస్తారని ఇందులో ఎటువంటి సందేహమూ లేదని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 25వ వార్డుకు చెందిన సుమారు వంద మంది జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు గురువారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసిపిలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014లో తన గెలుపునకు కృషి చేసిన యువత, 2019లో పవన్‌కళ్యాణ్ నేరుగా భీమవరం నుంచి పోటీ చేయడంతో పాటుగా ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉన్న నేపథ్యంలో అప్పటివరకు తన వెంట ఉన్న యువత పవన్ కళ్యాణ్‌కు మద్దతుగా నిలిచారని అన్నారు. వచ్చే నెలలో జరగబోయే ఎన్నికలలో పవన్ కళ్యాణ్ ఇక్కడి నుండి పోటీ చేయడం లేదని, అందుకే తిరిగి యువత తనపై ప్రేమ అభిమానాన్ని చాటుకుని సొంత గూటికి వస్తున్నారని ఈ సందర్భంగా వారిని స్వాగతిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జట్ల రాంబాబు, పతివాడ రాజేంద్ర, పోతుల చక్రి, తోట బాలాజీ పాల్గొన్నారు.

ముమ్మరంగా నేతల ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

లబ్ధి జరిగితేనే వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించండని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం పట్టణంలోని 26వ వార్డులో ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా జివి.ప్రసాద్ రాజు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ మంచి మనసుతో ఆలోచించండని, అందరి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. కుల మత ప్రాంతీయ వర్గ బేధం లేకుండా అన్ని వర్గాల వారికీ అండగా ఉంటూ సంక్షేమ పథకాలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో బర్రి శ్రీ వెంకట రమణ, పెంద్ర వీరన్న, ఇంజేటి రవీంద్ర, జిల్లెల దిలీప్ పాల్గొన్నారు.

ఆచంట : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంపై ప్రజల్లో మరింత విశ్వసనీయత పెరిగిందని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పెనుమంట్ర మండలం ఓడూరు, నెలమూరు గ్రామాల్లో రంగనాథరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను కలిసి రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని, ఆచంట నుంచి తనకు మరో అవకాశం కల్పించాలంటూ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎంఎల్‌ఎకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకాల్లో భాగంగా డిపిటి రూపంలో రూ.2.70 లక్షల కోట్లు, నాన్ డిబిటి రూపంలో రూ.1.79 లక్షల కోట్ల మేర ప్రజల ప్రయోజనం కోసం ఖర్చు చేశారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల్లో కూటమిదే విజయం : పితాని

ఆచంట : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని వైసిపికి అంతిమ గడియలు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం పెనుమంట్ర మండలం ఆలమూరులో ప్రజల వద్దకు పితాని ఎన్నికల ప్రచార పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతోనే జగన్ ప్రభుత్వంలో ఉన్న మంత్రులు అబద్ధపు ప్రచారానికి తెరలేపారన్నారు. అధికార పార్టీ అభ్యర్థులు డబ్బులతో గెలవాలని, అప్పుడే కొన్ని నియోజకవర్గాల్లో డబ్బులు పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని డబ్బులు ఎంత మద్యం పంపిణీ చేసినా మొన్న జరిగిన కర్ణాటక ఎన్నికలు, నిన్న జరిగిన తెలంగాణ ఎన్నికల్లో ప్రజల స్పష్టమైన తీర్పు ఇచ్చారని అదే తీర్పు ఆంధ్రప్రదేశ్లోనూ పునరావృతం అవుతుందని అన్నారు. నియోజకవర్గంలో రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షలు ఇళ్ల పట్టాల కోసం లబ్ధిదారుల నుంచి వసూలు చేసి జేబులు నింపుకున్నది వైసిపి నాయకులు కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వెలగల బులిరామరెడ్డి, సానబోయిన గోపాలకృష్ణ, షేక్ ముంతాజ్ బేగం ఆలీ, తమనంపూడి శ్రీనివాసరెడ్డి, గూడూరి మురళీమోహన్, కోయా వెంకట కార్తీక్ పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు నియోజకవర్గంలో సొంతింటి గోడలకు, తలుపులకు అభిమానంతో స్వచ్ఛందంగా అంటించుకున్న స్టిక్కర్లను, వాల్ పోస్టర్లను అధికారులు ఏ అధికారంతో తొలగిస్తారని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పాలకొల్లులో విలేకరులతో మాట్లాడారు. టిడిపి, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ సొంతిళ్లకు పార్టీలు అందజేసే పథకాలు వంటి గోడ స్టిక్కర్లు స్వచ్ఛందంగా అంటించుకున్న వాటికి అనుమతులు తీసుకున్న పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశామన్నారు. మా ఎన్నికల ఖర్చులోనూ రాసుకుంటామని తెలిపామని, అటువంటప్పుడు అధికారులు ఏ విధంగా తొలగిస్తారని అన్నారు. అధికార పార్టీ నాయకులకు తలొగ్గి అత్యుత్సాహంతో తప్పులు చేస్తే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

అంజిబాబును కలిసిన టిడిపి నేతలు

భీమవరం రూరల్ : మాజీ ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులును టిడిపి, జనసేన నాయకులు పెద్ద ఎత్తున కలిసి మద్దతు తెలిపారు. గురువారం స్థానిక 39వ వార్డు టిడిపి నాయకులు, శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు కలిశారు. అలాగే అంజిబాబు బిజెపి నాయకులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ నివాసానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కూటమి నాయకుల కార్యకర్తల సహకారంతో భీమవరంలో తను విజయం సాధిస్తానని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నరసాపురం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నరసాపురం రూరల్ సిఐ కె.గోవింద్‌రాజు అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని లిఖితపూడి, సరిపల్లి గ్రామాల్లో తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. గ్రామాల్లో శాంతి భద్రతలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ గోవిందరాజు మాట్లాడారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తహశీల్దార్ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ కె.గుర్రయ్య పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

తాడేపల్లిగూడెం: జగన్నాధపురంలో లక్ష్మీగణపతి ఫెర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్ వద్ద విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు రూ.26,544 విలువైన 4.14 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. కేసు నమోదు చేశారు. ప్రిన్సిపల్ సర్టిఫికేట్ లేని కారణంగా రెండు కంపెనీలకు సంబంధించిన రు.1,91,808 విలువైన 612 కేజీల పురుగుమందులు గుర్తించి వాటి అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో విజిలెన్సు ఎస్ఐ రంజిత్‌కుమార్, విజిలెన్సు ఎఒ పి.సురేష్ పాల్గొన్నారు.

మెరుపువేగంతో 6జి నెట్ వర్క్

తాడేపల్లిగూడెం: 5జి నెట్ వర్క్ కన్నా 6జి నెట్ వర్క్ చాలా సమర్థవంతంగా మెరుపు వేగంతో పనిచేయనుందని ఐఐటి (తిరుపతి) ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ ఆర్.సర్వేంద్రనాథ్ తెలిపారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ బిఎస్.మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో సంస్థలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం సహకారంతో ఇంటెలిజెంట్ రిఫ్లెక్టింగ్ సర్ఫేస్ ఎయిడెడ్ 6జి కమ్యూనికేషన్ సిస్టమ్ అంశంపై గురువారం సాయంత్రం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేంద్రనాథ్ మాట్లాడుతూ 5జి కంటే 6జి అడ్వాన్స్ టెక్నాలజీ అని తెలిపారు. 6జి కమ్యూనికేషన్లో వర్చువల్ రియాలిటీ వంటి నూతన సాంకేతికతలను వినియోగించి మరిన్ని కమ్యూనికేషన్లను అభివృద్ధి చేయనున్నారని చెప్పారు. అనంతరం సర్వేంద్రనాథ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ ఎస్.యువరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆచార్యులు వి.సందీప్, డాక్టర్ బి.నర్సింహారావు, ఎ.కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

చేపల చెరువుపై విష ప్రయోగం!

పోలీసులకు రైతు ఫిర్యాదు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీ పరిధి ఇంజేటివారిపాలెంలో పండుగప్ప చేపల సాగు చేస్తున్న చెరువుపై విషప్రయోగం చేశారని రైతు ఇంజేటి దానం ఆరోపించారు. గురువారం రైతు విలేకరులతో మాట్లాడుతూ తాను సాగు చేసుకుంటున్న 80 సెంట్ల చెరువులో రూ.1.50 లక్షల వ్యయంతో పండుగప్ప పిల్లలు వేశానని, వీటిని పెంచేందుకు ఇప్పటి వరకూ రూ.1.30 లక్షలు ఖర్చు అయ్యిందని తెలిపారు. బుధవారం రాత్రి సమయంలో తమపై కక్షపూరితంగా గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు విషప్రయోగం చేశారని దీంతో చేపలు మృత్యువాత పడ్డాయని ఆరోపించారు. గురువారం వేకువ జామున తేలియాడుతున్న చేపలను భీమవరం ల్యాబ్‌కు పంపగా విషప్రయోగంతో చేపలు మృతి చెందాయని గుర్తించారని, దీంతో తాను ఇద్దరు వ్యక్తులపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వివరించారు. తనకు న్యాయం చేయాలని పోలీసులను రైతు దానం కోరారు.



చెరువులో చనిపోయిన చేపలు

వేలం పాట వాయిదా

నరసాపురం: నరసాపురం మున్సిపాల్టీ పరిధిలోని 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి గాను రోడ్డు మార్జిన్ వద్ద రోజువారీ మార్కెట్ కూరగాయలు, పండ్లు పన్ను వసూలు చేసే వేలం పాట వాయిదా పడింది. తిరిగి బహిరంగ వేలం పాట ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో గొడ్ల కబేలా వద్ద పన్నులు వసూలు చేసేందుకు పాట నిర్వహించారు. బహిరంగ వేలంలో ముస్కుడి విక్టోరియా రూ.12,500లకు హెచ్చు పాట దక్కించుకున్నారు.

వైసిపిలో చేరికలు

నరసాపురం: జనసేన, టిడిపికి చెందిన 50 మంది నాయకులు గురువారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద్‌రాజు సమక్షంలో వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ప్రసాదరాజు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఇంజేటి రవీంద్ర, కడలి కనకేశ్వరరావు, పాకర్ల చిట్టిబాబు, ధనుంజయ్ రాయ్ పాల్గొన్నారు.

ఉండి: ఉండిలో టిడిపి, జనసేన పార్టీలకు చెందిన సుమారు 30 మంది యువకులు గురువారం ఉండి ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ ఆధ్వర్యంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు సమక్షంలో పార్టీలో చేరారు. వానిపి నరసింహరాజు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహారాజు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడిద వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బిసి డిక్లరేషన్ పోస్టర్ ఆవిష్కరణ

ఆచంట: ఆలమూరులో టిడిపి, జనసేన, బిజెపి బిసి డిక్లరేషన్ పోస్టర్‌ను మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి బిసి డిక్లరేషన్ ద్వారా బిసిలకు రక్షణ చట్టం 40 ఏళ్లకే పింఛన్ పంపిణీ కుల వృత్తులకు పూర్వ వైభవం వస్తుందన్నారు. బిసి డిక్లరేషన్ ఆ పార్టీ బిసి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి అనచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో తయారు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర దేవాంగ సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ బీరక ప్రసాద్, రొబ్బి భాస్కరరావు, కడలి ఏడుకొండలు, సానాబోయిన సూర్యనారాయణ పాల్గొన్నారు.